🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☎ : 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 3 | 17-10-2022 | పుటలు : 4


**అష్టావధాన కార్యక్రమం**
**ఈసీ హాల్, ది.13.10.2022**
**ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం**




**మాన్య మహోదయులు**
**ఉపకులపతి వర్యులు**
**ఆచార్య మొక్కా జగన్నాథరావు గారి గురించి అవధాని ఆశువుగా చెప్పిన పద్యాలు.**

మ.
అదిగో! వచ్చెను నేత అందరకు అత్యంతాప్తమిత్రుండు, స
మ్ముదమొప్పంగ తెనుంగు సేవ సలిపెన్ పూర్ణావధానమ్ముబీ భూ
రిదయాబుద్ధిని గల్గి బోధకునిగా సృష్టించె సచ్ఛాత్రులన్
నుదుటన్ భారతికిన్ సుభూషణమగున్ మొక్కా జగన్నాథుడే!

కం.
మొక్కలు శిష్యులు కాగా
నిక్కమ్ముగ మూలమగుచు నిలచెను ఘనుడై
చక్కఁగ మ్రొక్కఁగ వలయును
మొక్క జగన్నాథరావు బుధవర్యునకున్

అవధాన బాల భాస్కర, అష్టావధాని
భరత్ శర్మ ఉప్పలధడియం
తిరుపతి

# అష్టావధాని భరతశర్మకు వీసీ ప్రశంసలు



**13.10.22 (మీడియాసెల్)** చిన్నవయసులో మంచి ధారణతో అవధానాన్ని చేస్తూ, పద్యాన్ని అందంగా చదువుతూ మంచి పేరు తెచ్చుకున్న చిరంజీవి భరతశర్మను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రశంసించారు. గురువారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఈసీ హాల్ లో నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రం మరియు శ్రీ విశ్వనాథ సాహిత్య పీఠము సంయుక్త ఆధ్వర్యంలో అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవధాని 'బాల భాస్కర' ఉప్పలధడియం భరతశర్మ ఎనిమిది విషయాల పట్ల అవధానాన్ని కలిగి ఎంతో చక్కగా అష్టావధాన్ని నిర్వహించారు. అద్భుతమైన ధారణతో అందరినీ ఆకట్టుకునే విధంగా భరతశర్మ తమ సాహిత్య పటిమను కనపరిచారు. నన్నయ అభివృద్ధికి కృషి చేస్తున్న వీసీ జగన్నాథరావు కృషిని ప్రశంసిస్తూ ఆశువుగా ఆలపించిన పద్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ తెలుగు, సంస్కృత భాషల్లో మాత్రమే కనపడే అద్భుతమైన ప్రక్రియ అవధానమని అన్నారు. తెలుగు సాహిత్యంలో విశిష్టమైనది అవధానమని, ఎంతో కష్టమైన ఈ అవధానంలో ప్రతిభ కనపరుస్తున్న చిరంజీవి భరతశర్మకు శుభాకాంక్షలు తెలియజేసారు. మరెన్నో మంచి అవధానాలు చేస్తూ మంచి చదువుతో ముందుకు వెళ్లాలని ఎన్నో విజయాలు సాధించాలని అభినందించారు. భరతశర్మ 30వ అవధానం నన్నయ విశ్వవిద్యాలయంలో జరగడం ఎంతో హర్షనీయమని, విశ్వవిద్యాలయం ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తుందన్నారు.

దాతలు సమర్పించిన 15 వేల పుస్తకాలతో ప్రారంభించిన నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రం ద్వారా చక్కని కార్యక్రమం జరిగిందన్నారు. భవిష్యత్ లో మరిన్ని మంచి కార్యక్రమాలు నన్నయ విశ్వవిద్యాలయంలో జరుపుతామని తెలియజేసారు. తెలుగు భాష, సాహిత్యాలకు నన్నయ విశ్వవిద్యాలయం పెద్దపీఠ వేస్తుందని నన్నయభారతి, నన్నయఅధ్యయన కేంద్రం, నన్నయవాణి వంటివి విశ్వవిద్యాలయ అభివృద్ధికి, సాహిత్య అభిలాషకు నిదర్శనమన్నారు. అనంతరం అవధాని 'బాల భాస్కర' ఉప్పలధడియం భరతశర్మను, సాహిత్య ప్రముఖులను వీసీ జగన్నాథరావు సన్మానించి విశ్వవిద్యాలయ జ్ఞాపికలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులుగా డాక్టర్ పేరి రవికుమార్, ఆత్మీయ అతిథిగా డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద గురుసహస్రావధాని, ప్రోగ్రామ్ కన్వీనర్ నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డా.తలారివాసు, విశ్వనాథసాహిత్య పీఠం పేరాల సీతారామప్రభు, ఎర్రాప్రగడ రామకృష్ణ,డా.కడిమిళ్ళ వర ప్రసాద గురు సహస్రావధాని,శ్రీమతి మీనాక్షి,ధన్వంతరి,డా.తరపట్ల సత్యనారాయణ, పోచినపెద్ది సుబ్రహ్మణ్యం,ఓలేటి బంగారేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.


అవధాని భరతశర్మను సన్మానిస్తున్న వీసీ జగన్నాథరావు

# యువతకు ఆదర్శం అబ్దుల్ కలాం


## రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్


అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**15.10.22 (మీడియాసెల్)** చిన్నతనం నుండి ఎన్నో సమస్యలను అధిగమించి ఆకాశమే హద్దుగా ఎదిగిన అబ్దుల్ కలాం నేటి యువతకు ఆదర్శమని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో అబ్దుల్ కలాం 91వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ హాజరై అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భారతదేశ రాష్ట్రపతిగా, అంతరిక్ష శాస్త్రవేత్తగా అత్యున్నత స్థాయికి ఎదిగిన అబ్దుల్ కలాంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో తనదైన ముద్ర వేసుకుని మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు తెచ్చుకోవడం జాతికి గర్వకారణామన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం ఆశయ సాధన సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.సుబ్బారావు, డా.ఎం.గోపాలకృష్ణ, ఎస్.లింగారెడ్డి, జి.చంద్రకళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# వాల్‌చంద్ ప్లస్‌తో నన్నయ అవగాహన ఒప్పందం

**13.10.22 (మీడియాసెల్)** వాల్‌చంద్ ప్లస్, వాల్‌చంద్ పీపుల్ ఫస్ట్ లిమిటెడ్ ముంబై, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గురువారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో వాల్‌చంద్ ప్లస్ ప్రతినిధులు, యూనివర్సిటీ అధికారులు ఎంవోయు పై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ వాల్‌చంద్ ప్లస్, వాల్‌చంద్ పీపుల్ ఫస్ట్ లిమిటెడ్ ముంబై వారితో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. ఈ ఎంవోయు ప్రకారం విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వాల్‌చంద్ ప్లస్ సంస్థ కల్పిస్తుందన్నారు. మూడు సంవత్సరాల అవగాహన ఒప్పందంలో కనీసం ఆరు ప్రోగ్రామ్స్ చేస్తారని చెప్పారు. 90 గంటల స్కిల్ డెవల్పమెంట్ కోర్సుగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు కమ్యుకేషన్ స్కిల్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్ స్కిల్స్ వంటి వాటిపై శిక్షణ అందిస్తారన్నారు. బజాజ్ సి.ఎస్.ఆర్. ఫండ్స్ పై ఆధారపడి వాల్‌చంద్ ప్లస్, వాల్‌చంద్ పీపుల్ ఫస్ట్ లిమిటెడ్ సంస్థ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. దేశంలో మేధాసంపత్తిని పెంపొందించి విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చక్కని అవకాశమని తెలియజేసారు.


ఎంవోయు పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల నుండి విద్యార్థులు ఈ ప్రోగ్రామ్స్ లో చేరవచ్చునని చెప్పారు. తరువాత అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. అనంతరం అతిథులను సన్మానించి విశ్వవిద్యాలయ జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, వాల్‌చంద్ ప్లస్ సి.ఎస్.ఆర్. మేనేజర్ రష్మీ మన్సుఖాని, వాల్‌చంద్ ప్లస్ క్లస్టర్ ఇన్చార్జ్ బిలావత్ ధేనుకా నాయక్, ప్రినిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు, డీన్ డా.పి.వెంకటేశ్వరరావు, డా.పి.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



తిరుపతి వేంకట కవులు

# అవధాన కళ

అవధానం అంటే ఏకాగ్రత.ధారాశుద్ధి, ధారణా బలం ప్రధానంగా గల కవిత్వ విశేషమే అవధానం.దీనికి సహజ ప్రతిభకు తోడు అభ్యాసం కూడా కావాలి.అసలు కవిత్వమే అటువంటిది. అవధానానికి శక్తి, నైపుణ్యం, కావ్య శిక్ష, అభ్యాసాలే కాకుండా సమయస్ఫూర్తి, ఆశుధార, ధారణలు మరింత ముఖ్యం. పృచ్ఛకులడిగే అసంబద్ధమైన ప్రశ్నలు,సమస్యలు విరుద్ధంగా ఉంటే వాటిని ఒకదారికి తెచ్చి మనోరంజకం చేయగల సమయస్ఫూర్తి దానితోపాటు చమత్కార ధోరణి, పద్యాన్ని శ్రావ్యంగా వినిపించగల పద్ధతి, లోకజ్ఞతలు అవసరం. అవధానకళ కవిత్వం పట్ల ఆసక్తి లేని వారికి కూడా ఆసక్తిని కలిగిస్తుంది. తిరుపతి వేంకటకవులు కవిత్వాన్ని విని చాలామంది కవులయ్యారు. అవధానాల్లోని కవిత్వం, రసస్ఫూర్తి సామాన్యుల్ని సైతం అలరిస్తుంది. ప్రేక్షకుల్ని ఆకర్షించింది. మహారాజుల్ని అలరింపజేసి సన్మానాల్ని పొందింది. అంతటి విశిష్టత అవధాన కళ సొంతం.

" సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్ " అన్నట్లు కవితా వైభవాన్ని ప్రాజ్య సామ్రాజ్య వైభవంతో పోల్చి కవి రాజులు, కవి చక్రవర్తులు ఆనందిస్తున్నారు. కవి కనిపించగానే ఏదో ఒక విషయాన్ని వర్ణించమని సమస్యనిచ్చి పూరించమని సరసులైన చక్రవర్తులు అడగటం, దానికి సద్యః స్ఫూర్తితో కవి చేసిన వర్ణనకు ఆనందించి అక్షరలక్షలు ఇవ్వటం సాహిత్య చరిత్రలో అందరికీ తెలిసిన విషయమే.

అలా గౌరవాన్ని పొందిన కవులు అప్పుడూ ఉన్నారు. ఇప్పుడు పొందుతున్న వారు ఉన్నారు.

ఎన్ని కఠిన నియమాలు ఉన్నా వేగంగా పద్యం చెప్పటమే ఆశు కవిత్వ ప్రధాన లక్ష్యం. దీనిని ఒక కళగా సంస్కృతాంధ్ర కవులు పోషించారు. ఆశు కవితాప్రధానమైన అవధానం అనగానే తెలుగు ప్రపంచం పులకించిపోతుంది. అది మన సొంతం అని గర్విస్తుంది.ప్రస్తుత కాలంలో ఎన్నెన్నో ప్రయోగాలు ఎన్నో విశేషాలతో అవధాన విద్యావృక్షం బహు శాఖలుగా విస్తరిల్లింది. ప్రస్తుతం తెలుగు నాట అవధానాలు చక్కగానే జరుగుతున్నాయి.

అవధానం అష్టావధానం నుంచి షోడశ గణితం వరకు ఎదిగింది. శతావధానం, మహాసహస్రావధానం, పంచ సహస్రావధానం ఇలా అనేక అవధాన ప్రక్రియలు వచ్చాయి. నిషిద్ధాక్షరి, వ్యస్తాక్షరి,న్యస్తాక్షరి, సమస్య, దత్తపది, వారగణనం,వర్ణన, ఆశువు,ఛందో భాషణం, అవధాని ధారణకు అడ్డు తగిలే అప్రస్తుత ప్రసంగం..ఇలా కొన్ని అంశాలతో ప్రశ్నిస్తున్నప్పుడు వాటిని పూరించే పనిలో అవధాని ఉంటారు.ఏకాగ్రతను భంగం చేస్తూ కొంటెగా, వ్యంగంగా అప్రస్తుతం ఉంటుంది. దానికి తగినట్లు అవధాని మరింత కొంటెగా, చమత్కారంగా సమాధానాలు ఇస్తారు.సభలో నవ్వుల పువ్వులు పూస్తూ ఉంటాయి.

మేడసాని,బేతవోలు, గరికిపాటి, కడిమిళ్ళ,కోట, వద్దిపర్తి, ఆముదాల,బులుసు అపర్ణ వంటి అవధానులు...విశేషమైన అవధానాలు చేస్తున్నారు. కడిమిళ్ల,కోట జంట అవధానాలు చేసి ప్రాచీన పద్ధతిని అనుసరించారు. పిన్నలమైనా మేమూ చేయగలమని తాతా సందీప్ శర్మ,గన్నవరం లలితాదిత్య,ఉప్పలధడియం భరతశర్మ వంటివారు చక్కని అవధానాలు చేస్తున్నారు.

అవధానాన్ని పవిత్ర యజ్ఞంగా, సరస్వతీ ఉపాసనగా భావిస్తూ అవధానాలు చేస్తున్నవారు బహుముఖీనమైన ప్రజ్ఞను ప్రదర్శించి అపూర్వమైన యశస్సును పొందాలని, అవధానకళ మరింత వ్యాప్తిని పొందాలన్నదే ఆకాంక్ష.

# వుండవల్లి బాపిరాజుకు నన్నయ నివాళి

**11.10.22 (మీడియాసెల్)** ప్రముఖ విద్యావేత్త, వితరణశీలి, వి. యస్ యం. కళాశాల, రామచంద్రపురం పూర్వ అధ్యాపకులు వుండవల్లి బాపిరాజు అనారోగ్యంతో కన్నుమూశారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి అశోక్ సంతాపం తెలిపారు. గతనెలలో మేజర్ శ్రీ వుండవల్లి బాపిరాజు ఎండోమెంట్ ప్రైజ్ పేరుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయనికి నాలుగు లక్షలరూపాయలను అందజేసారు. ఈ నాలుగు లక్షల రూపాయలపై వచ్చిన వడ్డీని ప్రతి సంవత్సరం విశ్వవిద్యాలయం పరిధిలో బి. ఏ. లో ప్రధమ స్థానం వచ్చిన విద్యార్థికి, బి. ఏ. పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులో ప్రథమస్థానం, ఎం. ఏ. పొలిటికల్ సైన్స్ మరియు ఎం. ఏ. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అందజేయటం జరుగుతుంది.



సామాజిక, ఆధ్యాత్మిక, విద్యారంగాలలో బహుముఖ సేవలతో బాటు దానగుణం కలిగిన శ్రీ బాపిరాజు వ్యక్తిత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య యస్. టేకి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు శ్లాఘించినారు. వారి మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. నల్గొండ జిల్లా సూర్యాపేటలో స్కూల్ అసిస్టెంట్ గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన బాపిరాజు, వి. యస్ యం. కళాశాలలో సుమారు మూడున్నర దశాబ్దాలు రాజనీతి ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యాపకునిగ, డిపార్ట్మెంట్ హెడ్ గా తన సేవలనందించారు. 1996 లో ఉద్యోగ విరమణ చేసిన అనంతరం గత 26 సంవత్సరాలుగా వివిధ సామాజిక , ఆధ్యాత్మిక, సేవారంగాలలో చురుకుగా పాల్గొంటున్నారు. ఆయన గీతాసారము, శ్రీరామ కృష్ణ పరమహంస మరియు శ్రీ స్వామి వివేకానంద జీవిత విశేషాలు అనే పుస్తకాలను కూడ సంకలనం చేసి సమాజంలో ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందించటానికి కృషి చేసారు.

# ప్రి రిపబ్లిక్ డే పరేడ్ లో నన్నయ విద్యార్థుల ఎంపిక

**13.10.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో వెస్ట్ జోన్ ప్రి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలక్షన్స్ ను నిర్వహించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుండి 200 మంది ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు ప్రి ఆర్.డి సెలక్షన్స్ కు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై దేశ రాజధానిలో 2023 జనవరి 26వ తేదీన జరిగే రిపబ్లిక్ డే పరేడ్ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనపరచాలని అన్నారు. ప్రి రిపబ్లిక్ డే ఎంపికలలో విద్యార్థుల చురుగ్గా పాల్గొనాలని, విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు చక్కని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రి రిపబ్లిక్ డే పరేడ్ లో ఎంపికైన విద్యార్థులు దేశభక్తితో రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొని నన్నయ విశ్వవిద్యాలయ ఖ్యాతిని చాటిచెప్పాలన్నారు. శారీర, మానసిక ఆరోగ్యాలను పెంపొందించుకుంటూ కమ్యూనికేషన్ స్కీల్స్ ను అభివృద్ధి చేసుకొని సమాజ సేవలో ముందుకు సాగాలన్నారు. తరువాత ఎన్.ఎస్.ఎస్ రీజినల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ, రామచంద్రరావు, యూనివర్సిటీ కో.ఆర్డినేటర్ డా.బి.కెజియారాణి విద్యార్థులకు ప్రి రిపబ్లిక్ డే పరేడ్ నియమ నిబంధనలను తెలియజేసారు. అనంతరం విద్యార్థుల పొడవు కొలతలు, పరుగుపందాలు, మార్చ్ పాస్ట్ వంటి ఫిజికల్ ఫిట్ నెస్ టెస్ట్ లు నిర్వహించారు. అలాగే విద్యార్థుల్లోని కమ్యూనికేషన్స్ స్కిల్స్, లాంగ్వేజ్ స్కిల్స్ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఫిజికల్, కమ్యూనికేషన్ టెస్ట్ లలో ప్రతిభ కనపరచిన ముగ్గురు అబ్బాయిలను, ముగ్గురు అమ్మాయిలను ఎంపిక చేస్తారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ మరియు అనుబంధ కళాశాలల ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# ఐ.జి.సి.ఎ.ఆర్. లో పరిశోధన అవకాశాలపై సదస్సు

**15.10.22 (మీడియాసెల్)**

ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (ఐజిసిఎఆర్)లోని సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన పరిశోధన అంశంలపై శాస్త్రవేత్తలతో శనివారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. రసాయన శాస్త్రంలో మొదటి భారతీయ పరిశోధన పాఠశాలను స్థాపించి, భారతదేశంలో రసాయన శాస్త్ర పితామహుడిగా పేరొందిన ఆచార్య సర్ ప్రఫుల్ల చంద్ర రే స్మారక కార్యక్రమాలలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో "అధ్యాపకుల పరిశోధన అవకాశాలు" అనే అంశంపై ఇంటరాక్టివ్ సెషన్‌ను జరిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆఫ్ కిమిస్ట్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మరియు ఐజిసిఎఆర్ సైంటిఫిక్ ఆఫీసర్స్ డా.సి.ఎ.ఎస్. బ్రహ్మానందరావు, డా.ఎ.శ్రీరామమూర్తిలు ప్రధాన వక్తలుగా హాజరై ఉపన్యసించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ వీసీ మొక్కా జగన్నాథరావు ప్రోత్సహంతో విశ్వవిద్యాలయంలో పరిశోధన, ప్రాజెక్టులకు సంబంధించిన పలు కార్యక్రమాలపై దృష్టిసారిస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగా ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (ఐజిసిఎఆర్)లోని సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన పరిశోధన అంశంలను శాస్త్రవేత్తలు వివరిస్తారని చెప్పారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులకు, విద్యార్థులకు ఈ ప్రాజెక్టులు, పరిశోధనలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. బ్రహ్మానందరావు మాట్లాడుతూ బోర్డ్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ న్యూక్లియర్ సైన్సెస్ (BRNS) అనేది డిపార్ట్మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (DAE) యొక్క సలహా సంస్థ అని, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు మరియు జాతీయ ప్రయోగశాలలకు ఆర్థిక సహాయాన్ని సిఫార్సు చేస్తుందని తెలియజేసారు. డిపార్ట్మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ యొక్క ఆదేశానికి సంబంధించిన రంగాలలో శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. డా.ఎ.శ్రీరామమూర్తి మాట్లాడుతూ రిసెర్చ్ డెవలప్మెంట్ ప్రాజెక్టులను గుర్తించి నిధులు సమకూర్చడం, సింపొజియా కాన్ఫరెన్స్‌లను నిర్వహించడానికి ఆర్థిక మద్దతు, కృష్ణన్ రీసెర్చ్ అసోసియేట్‌షిప్ (KSKRA) పథకం కింద రిక్రూట్‌మెంట్, కౌన్సిల్ ద్వారా పరిశోధన ప్రాజెక్టలను అవార్డ్ చేయండం, ఎంటెక్ ఫెలోషిప్ అవార్డులు, పిహెచ్.డి ప్రోగ్రామ్ లు, రిటైర్డ్ సెంటిస్టుల అవార్డులు వంటి పరిశోధన, ప్రాజెక్టుల కార్యక్రమాలను వివరించారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య కె.రమణేశ్వరి, ప్రోగ్రామ్ కన్వీనర్ డా.దీప్తి, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులను వివరిస్తున్న సైంటిస్ట్ బ్రహ్మానందరావు

# విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి





ఉన్నత విద్యతో పాటే క్రమశిక్షణతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచించారు. 2021-22 విద్యా సంవత్సరంలో యూజీ, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన 780 మంది విద్యార్థినులకు పట్టాలు అందజేసేందుకు శనివారం ఏలూరు డిగ్రీ పట్టాలను అందిస్తున్న వీసీ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఆడిటోరియంలో 33 వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు స్వర్ణ, రజిత పతకాలు, మిగిలిన విద్యార్థినులకు పట్టాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.మెర్సీ మాట్లాడుతూ 64 యూజీ కోర్సుల్లో 97 శాతం, 16 పీజీ కోర్సుల్లో 92 శాతం ఉత్తీర్ణతను సాధించామని వివరించారు. అనంతరం వీసీని సత్కరించారు. కళాశాల సుపీరియర్ సిస్టర్ మరియెట్టా పూదోట, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల పాల్గొన్నారు.





# అంతర్జాతీయ సదస్సులో నన్నయ ఆచార్యులు టేకి




ఒస్లో యూనివర్సిటీలో ప్రసంగిస్తున్న ఆచార్య టేకి

అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంస్థ, ప్రపంచ పరిసరాల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో మూడవ అంతర్జాతీయ న్యాయవిధుల పరిరక్షణ సదస్సుకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎస్.టేకి హాజరయ్యారు. నార్వే దేశంలోని ఒస్లో పట్టణంలో యూనివర్సిటీ ఆఫ్ ఒస్లో లో అక్టోబర్ 2వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ న్యాయవిధులు పరిరక్షణ సదస్సుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి ఆచార్య ఎస్.టేకి ఎంపికయ్యారు. ఈ సదస్సులో 150 దేశాల నుండి 200 మంది న్యాయమూర్తులు మరియు ఆచార్యులు హాజరై పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలను చర్చించారు. ప్రపంచ ఉష్ణోగ్రత, కాలుష్యానికి కారణాలు మరియు నివారణ చర్యలు వంటి అంశాలపై ఆచార్య ఎస్.టేకి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. వివిధ దేశాలలో ఉన్న కాలుష్య నియంత్రణ చట్టాలు, విధానాలను ప్రస్తావించారు. జాయింట్ ఫారెస్ట్ మేనేజ్మెంట్, కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సహకారంతో కాలుష్య నియంత్రణ మార్గాలను సూచించారు. అంతర్జాతీయ సదస్సులో పాల్గొని యూనివర్సిటీకి విచ్చేసిన ఆచార్య ఎస్. టేకి ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి అశోక్, విశ్వవిద్యాలయ అధికారులు, విభాగాధ్యాపకులు అభినందించారు.






తమ రచనలను విశ్వవిద్యాలయంలోని నన్నయ భారతి కి సమర్పిస్తూ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావుకు అందిస్తున్న గురుసహస్రావధాని డా.కడిమిళ్ళ, పద్యవిద్య రచయిత డా.పేరి రవికుమార్.

## మంచి మాట

అభిప్రాయాలను
మార్చుకోలేని వ్యక్తి
తన తప్పుల్ని
సరిదిద్దుకోలేడు
నేటికంటే రేపు ఎక్కువ
వివేకం ప్రదర్శించాలనుకుంటే
మనిషిలో మార్పు
అవసరం


# పద్య విద్య పుస్తకం



ఈ బృహద్గ్రంథం ఛందోబోధిని. ఛందస్సును బోధించే గ్రంథం. ఛందస్సును నేర్చుకునేవారికి ఉపయోగపడే గ్రంథం.జిజ్ఞాసువులు స్వయంగా నేర్చుకోవడానికి ఉపయోగపడే గ్రంథం.

ఛందస్సును బోధించడానికి ఇది ఎంతో ఉపయోగం.ఛందస్సులో ఉన్న ప్రాథమికమైన అంశాల నుంచి క్లిష్టతరమైన శాస్త్రవిషయాలను వివరించడానికి ఈ గ్రంథంలో ఎంతో ప్రయత్నం జరిగింది. దీనిని విశాఖపట్నం పండితులు శ్రీ పేరి రవికుమార్ రచించారు. తెలుగు సంస్కృతాల్లో స్నాతకోత్తర విద్యను అభ్యసించారు. ప్రస్తుతం సారస్వత సేవలో ఉన్నారు.

పద్య లక్షణాలను,యతులను, ప్రాసలను నేర్చుకోవటం తేలిక. కానీ కావ్య ప్రయోగాలను చూస్తే చాలా విషయాలు స్పష్టంగా తెలియవు. పద్యాన్ని రాయాలని ప్రయత్నిస్తే ఎన్నో సందేహాలు కలుగుతాయి. కాబట్టి అటువంటి సందేహాలు తీర్చే ఉత్తమ గ్రంథంగా " పద్యవిద్య " ను చెప్పుకోవచ్చు. ఇందులో ఒక్కొక్క అంశాన్ని




నేర్చుకుంటూ ఎవరైనా పద్య రచన చేయవచ్చు. తమంత తాముగా ఛందస్సును నేర్చుకోవడానికి ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్రస్తుత కాలంలో పద్యాలు, ఛందస్సు ఎవరికి కావాలనో, శాస్త్ర గ్రంథాలను ఉపయోగించుకునే వారు ఎంతమంది ఉన్నారనో ప్రశ్నలు చాలామందిని వెంటాడుతాయి. అయితే తెలుగు భాషలో పద్యం ఎప్పుడూ బ్రతికే ఉంటుంది. అనంతమైన కాలంలో, విశాలమైన ప్రపంచంలో పద్యాన్ని ప్రేమించేవారు, నేర్చుకునేవారు కొద్దిమంది అయినా ఉంటారనే విశ్వాసం రచయితకు ఉంది.ఆ ఆశయంతోనే ఎంతో శ్రమించి రచయిత ఈ గ్రంథాన్ని రచించారు.పద్యం తెలుగువారి ఆస్తి. నన్నయ గారి నుంచి మొదలైన పద్యం వెయ్యేళ్ల నుండి ఎంతో వైభవాన్ని పొందింది. ఇకముందు కూడా దాని స్థానం పవిత్రంగానే ఉంటుంది. పద్య ప్రియులకు తెలుగు భాషాభిమానులకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగకరం.

**పద్యవిద్య**
**పుటలు: 1148**
**ప్రతులకు: రచయిత**
**98662 77975**

**- పోతుల శివాజి**
పరిశోధక విద్యార్థి,ANUR

# నన్నయవాణి మూడో ఏడాదిలోకి..

అభిప్రాయ మాలిక

## వార్షికోత్సవ శుభాకాంక్షలు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వారం వారం ప్రచురిస్తున్న "నన్నయవాణి" వార్షికోత్సవం జరుపుకోవటం సంతోషం. సంస్థ సాధించే అభివృద్ధికి పత్రిక అద్దంపడుతోంది. గోదావరీ మండలాల్లో ప్రత్యేక విశ్వవిద్యాలయ సాధనకోసం ఎంతో పోరాడగా లభించిన ఈ విశ్వవిద్యాలయం అచిరకాలం లోనే ఆశించినదానికన్నా ఎక్కువ అభివృద్ధి సాధించింది. గతంలో పనిచేసిన ఉపకులపతులు , రిజిస్ట్రార్లు కావించిన కృషికి మరింత నిర్మాణాత్మక దృష్టితో పనిచేస్తున్న ప్రస్తుతం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారిని– రిజిస్ట్రార్ ఆచార్య టి . అశోక్ గారిని గారిని , వివిధ విభాగాల ఆచార్యుల్ని అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిని – హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. విద్యార్థినీ విద్యార్థులు నన్నయ విశ్వవిద్యాలయం వల్ల గొప్పలాభంపొందగలరని ఆశిస్తూ అందరికీ శుభాకాంక్షలు అందిస్తున్నాను.

**- డా.చినమిల్లి సత్యనారాయణ రావు**
**కార్యదర్శి, శ్రీ Y.N. కళాశాల , నరసాపురం**

## నన్నయ అభివృద్ధిపై అవగాహన



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిపై ప్రజలందరికీ అవగాహన కల్పించే సాధనంగా నన్నయవాణి విశ్వవిద్యాలయ వార పత్రిక ముందుకు సాగుతుంది. కాకినాడ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం ఎస్ ఎన్ క్యాంపస్ కాకినాడలో జరిగే కార్యక్రమాలు నన్నయవాణిలో ప్రచురమవుతున్నాయి. నన్నయ వాణి యూనివర్శిటీలో జరిగే అన్ని సంఘటనలపై అవగాహన కల్పిస్తారు. వార్షికోత్సవం సందర్భంగా సంపాదకీయ బృందానికి అభినందనలు.

**డా.పి. చిరంజీవి కుమారి,**
**సెక్రటరీ & కరస్పాండెంట్,**

## విద్యా, క్రీడా కార్యక్రమాలకు వేదిక



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు స్థాపించిన నన్నయవాణి విశ్వవిద్యాలయ వారపత్రిక వార్షికోత్సవ శుభాకాంక్షలు. న న్న య ం వా ణి లో విశ్వవిద్యాలయ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారుల గురించిన వార్తలు ప్రచురితం అవుతున్నాయి. దీనిలో సంపాదకీయం, మంచి మాట, స్ఫూర్తి వంటి కథనాలు విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి. నన్నయ విశ్వవిద్యాలయ పిహెచ్.డి. విద్యార్థిగా విశ్వవిద్యాలయ స్థాయిలో తొలి తెలుగు వారపత్రికను స్థాపించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వీసీ జగన్నాథరావు గారికి సంపాదక మండలకి, పాఠకులకు, క్రీడాకారులకు అభినందనలు.

**నైనా జైస్వాల్**
**నన్నయ పిహెచ్.డి. విద్యార్థి**
**అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి**

## జగద్విదిత నన్నయవాణికి అభినందనలు!



వేదంలా ఘోషించే గోదావరి తీరంలో ఎప్పుడు అడుగుపెట్టినా పవిత్రమైన భావన మనసుని అల్లుకుని పులకరింపజేస్తుంది. అనాదిగా కళలకు ఆలవాలమైన రాజమహేంద్రవరంలో నెలకొన్న నన్నయ విశ్వవిద్యాలయంలో శిష్య పరంపరకు అత్యుత్తమ బోధనను అందజేస్తున్న గురువర్యులకు, అచ్చోట ఉద్భవించి, విరిసి, ప్రపంచవ్యాప్తంగా తెలుగుఔన్నత్యాన్ని చాటుతున్న శిష్యులకు ఆలవాలమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వాణిని వినిపిస్తున్న నన్నయవాణి పత్రికకు ముందుగా అభినందనలు. నన్నయవాణి వారపత్రికను నేను చాలా యాదృచ్ఛికంగా చూడడం తటస్థించింది. ఇటీవల నా భారతదేశ పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరానికి వచ్చినపుడు ఆనంద్ మిత్రుల ద్వారా పరిచయం అయ్యారు. అటుపిమ్మటే నన్నయవాణి వారపత్రికను పరిచయం చేశారు. ప్రతి సోమవారం క్రమం తప్పకుండా విడుదల చేస్తూ, వాట్సాపులో పంపుతూ అమెరికా వంటి దూరతీరాల్లో ఉన్న ఎందరో సాహితీకారులకు, సాహిత్యాభిలాషులకు, తెలుగు భాషాభిమానులకు నన్నయ విశ్వవిద్యాలయ ఖ్యాతిని తెలియజేస్తున్నారు. ఇందులో విశ్వవిద్యాలయ కార్యక్రమాల విశేషాంశాలే కాకుండా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసే అనేక సాహిత్యాంశాలు కూడా విశేషం. అలాగే ఏ ఇతర అచ్చు పత్రికలకు తీసిపోని విధంగా చక్కని పేజ్ సెట్టింగ్, స్పష్టమైన చిత్రాలు, అచ్చుతప్పుల్లేకుండా ప్రచురించడం వంటి ఉత్తమ ముద్రణా విలువలతో అత్యుత్తమంగా తీర్చిదిద్దడం మరో విశేషం. "నెచ్చెలి" అంతర్జాల వనితా మాస పత్రిక వ్యవస్థాపక సంపాదకురాలిగా ఒక పత్రికను నడపడంలో కష్టం అర్థం చేసుకోగలను. క్రమం తప్పకుండా పత్రికను వెలువరించడంలోనూ, నన్నయ విశ్వవిద్యాలయ వాణి జగద్విదితం కావడానికి పాటుపడుతున్న నన్నయవాణి పత్రికా నిర్వహకులకు ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా హృదయపూర్వక అభినందనలు.

**-డా.కె.గీతామాధవి**
**కంప్యూటేషనల్ లింగ్విస్ట్, ఆపిల్, కాలిఫోర్నియా**

## ఆసక్తికరమైన సమాచారం



ఆదికవి నన్నయ పేరుతో వెలువడుతున్న నన్నయ విశ్వవిద్యాలయం సమాచార సమాహారం నన్నయవాణి. దేశవిదేశాలలో అందరికీ చేరువయ్యేలా తేనెలొలుకు తెలుగు వాణి, తక్కువ సమయంలో అంతర్జాలంలో వెలువడుతున్న విశ్వవిద్యాలయ విశేషాల మధురవాణి, విలక్షణమైన శీర్షికలు, వ్యాసాలు, లేఖలతో అటు విద్యార్థులకు ఇటు అధ్యాపకులకు స్ఫూర్తిదాయకంగా నడపబడుతున్న అక్షర వాణి, వినూత్న అంశాలతో విద్యార్థులలో సృజనాత్మకత పెంచే భావ వాణి, సంస్కృతీ సంప్రదాయాల సంస్కార వాణి అయిన నన్నయ వాణి రెండు వసంతాలు పూర్తిచేసుకుని మూడవ వసంతం లోనికి అడుగిడుతున్న శుభ తరుణంలో ఉపకులపతి ఆచార్య మొక్క జగన్నాథ రావు గారికి, సంపాదక మండలి కి అభినందనలు. ఇంతై ఇంతింతై వటుడింతై అన్నట్లుగా భవిష్యత్తులో ఎన్నో ఎన్నెన్నో ఆధునిక ఆవిష్కరణలతో విశ్వవిఖ్యాతి నొందాలని ఆశిస్తున్నాను.

**డాక్టర్ మెర్సీ. పి**
**ప్రిన్సిపాల్ సిహెచ్. ఎస్.డి. సెయింట్ థెరిసా కళాశాల, ఏలూరు.**

## వీసీ గారి వినూత్న ఆలోచన నన్నయవాణి



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారి వినూత్న ఆలోచన ఆలోచనకు రూపం నన్నయవాణి. విశ్వవిద్యాలయానికి ఉమ్మడి గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలలకు విద్యా, పరిశోధన, ప్రగతి సంబంధిత అంశాలపై విలువైన సమాచారాన్ని అందించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. అతి తక్కువ ఖర్చుతో అంతర్జాల మాధ్యమాల ద్వారా విస్తృతంగా దేశ విదేశాలలో తెలుగు వారికి చేరుతుంది. విశ్వవిద్యాలయ ప్రగతికి, కళాశాలతో కమ్యూనికేషన్ కు నన్నయవాణి వారధిగా ఉంది. రెండు వసంతాలు పూర్తి చేసుకుని మూడో వార్షికోత్సవంలోకి ప్రవేశిస్తున్న నన్నయవాణికి శుభాకాంక్షలు.

**జె రమణాజీ (ప్రధాన కార్యదర్శి)**
**AP ప్రైవేట్ డిగ్రీ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్, విజయవాడ**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in